సాక్షి
అనంతపురం

సోమవారం । 10 । ఏప్రిల్ । 2023



పేరూరు జనసంద్రం

ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పర్యటన సందర్భంగా రామగిరి మండలం పేరూరు గ్రామం జనసంద్రమైంది. 8లో



రేషన్ బియ్యం పట్టివేత

జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో అక్రమంగా తరలుతున్న 82 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
40.9°/21.4°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఎండలు పెరిగాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. ఆగ్నేయం దిశగా 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.



న్యూస్‌రీల్

టమాట కిలో రూ.7



అనంతపురం అగ్రికల్చర్: అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.7, కనిష్టంగా రూ.3, సరాసరిన రూ.3 పలికింది. మార్కెట్‌కు 28 టన్నుల టమాటాలు అమ్మకానికి వచ్చాయని ఏడీఎం పి.సత్యనారాయణచౌదరి, రాప్తాడు సెక్రటరీ రామ్‌ప్రసాద్ తెలిపారు.

పారిశ్రామిక పాలసీ గడువు పొడిగింపు

అనంతపురం టౌన్: పారిశ్రామిక పాలసీని రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. గతంలో 2020–23గా ఉన్న పారిశ్రామిక పాలసీ గడువును 2023–27గా నాలుగేళ్ల పొడిగిస్తూ పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి కరికల్ వలవెన్ ఉత్తర్వులను జారీ చేసినట్లు పరిశ్రమల శాఖ అనంతపురం జిల్లా జనరల్ మేనేజర్ నాగరాజారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన పాలసీతో పారిశ్రామిక వేత్తలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. 2020–23 పాలసీతో జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల వర్గాలకు చెందిన 150 మంది లబ్ధిదారులు సూక్ష్మ పరిశ్రమలను ఏర్పాటు చేసుకొని పదుల సంఖ్యలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించారని తెలిపారు. వీటితోపాటు ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు వాహనాలను ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. నూతన పాలసీలోని మార్గదర్శకాలను త్వరలోనే పరిశ్రమల పోర్టల్‌లో ఉంచనున్నట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకు పరిశ్రమల శాఖ కార్యాలయంలోని హెల్ప్ డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు.

ఎలుగుబంటి దాడిలో రైతుకు గాయాలు



చికిత్స పొందుతున్న రైతు రామాంజనేయులు

కళ్యాణదుర్గం: తిమ్మసముద్రం గ్రామానికి చెందిన రైతు రామాంజనేయులుపై ఎలుగుబంటి దాడి చేసింది. ఆదివారం వేకువజామున పొలానికి వెళ్తుండగా ముళ్ల పొదల్లోంచి ఒక్కసారిగా ఎలుగుబంటి దాడి చేయడంతో భుజానికి, తలకు బలమైన గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే రామాంజనేయులును అనంతపురం ఆస్పత్రికి తరలించారు. అడవి జంతువులు తరచూ రైతులపై దాడులు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో 'ఎస్కేయూ'కు కాంస్యం




కాంస్య పతకాన్ని సాధించిన ఎస్కేయూ జట్టు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఎస్కేయూ జట్టుకు కాంస్య పతకం దక్కింది. చండీఘడ్‌లోని పంజాబ్ యూనివర్సిటీ వేదికగా ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు ఆల్ ఇండియా యూనివర్సిటీల సాఫ్ట్‌బాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఏఎన్‌యూ జట్టుపై 6–1 స్కోరుతో ఎస్కేయూ జట్టు విజయం సాధించి, కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా జట్టు క్రీడాకారులను ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ శ్రీనివాసన్, కోచ్ వెంకటేశులు, రెక్టార్ మల్లికార్జునరెడ్డి, రిజిస్ట్రార్ లక్ష్మయ్య ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులోనూ సత్తా చాటాలని వారు ఆకాంక్షించారు.

మోతాదు మించితే ముప్పే

దాక్టరుకు, మందులకు, రోగులకు అవినాభావ సంబంధం ఉంటుంది. ఇది ఎవరూ కాదనలేని సత్యం. కానీ ఉమ్మడి అనంతపురం జిల్లాలో జబ్బేదో తెలియకుండా, డాక్టరుకు చూపించకుండా లక్షలాదిమంది మందుల షాపుల్లో ఇస్తున్న మందులతోనే సరిపుచ్చుకుంటున్నారు. షాపులో ఒక్కోసారి ఫార్మసిస్టు లేకుండా కూడా మందులు ఇస్తారు. ఇలా రోగమొకటి, మందొకటి తీసుకుంటుండటం వల్ల భవిష్యత్‌లో తీవ్ర ముప్పు ఎదుర్కోవలసి వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

- ఎడాపెడా మందుల వినియోగం తప్పు
- డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందుల విక్రయం
- యాంటీబయోటిక్స్, పెయిన్ కిల్లర్స్ అతిగా వాడకం
- కిడ్నీ, కాలేయ వ్యాధులబారిన పడుతున్న రోగులు
- మెడికల్ స్టోర్లలో కౌంటర్ అమ్మకాలపై నియంత్రణ శూన్యం



సాక్షి ప్రతినిధి, అనంతపురం: జలుబు, దగ్గు, జ్వరం, కడుపునొప్పి, తలనొప్పి, బీపీ, షుగర్ తదితర జబ్బులకు వాడే మందులను డాక్టర్‌ను సంప్రదించకుండానే మెడికల్ స్టోర్(కౌంటర్)కు వెళ్లి తెచ్చుకునేవారి సంఖ్య అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో క్రమేణా పెరుగుతోంది. 30 శాతం మంది డాక్టర్ ప్రిస్క్రిప్షన్‌తో వెళితే.. 70 శాతం మంది డాక్టర్ ప్రమేయమే లేకుండా మెడికల్ స్టోర్లలో మందులు తెచ్చుకుంటున్నారు. రోగ నిర్ధారణ జరగకుండా.. సరైన మందు మోతాదు అంచనా వేయకుండా వినియోగిస్తున్నారు. ఫార్మసిస్టు లేనిచోట్ల అనామకులు కూడా మందులు విక్రయిస్తున్నారు. ఇలాంటి మందులకు అలవాటుపడి చివరకు కిడ్నీలు, కాలేయ వ్యాధులకు గురవుతున్నారు. ముఖ్యంగా యాంటీబయోటిక్స్, పెయిన్ కిల్లర్స్ మందుల వాడకం విచ్చలవిడి కావడంతో తీవ్ర ముప్పు కలగనున్నట్టు వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇంత జరుగుతున్నా మెడికల్ స్టోర్లలో యథేచ్ఛగా సాగుతున్న కౌంటర్ సేల్‌పై ఔషధ నియంత్రణ సంస్థ చర్యలు శూన్యమనే చెప్పాలి.

ఉమ్మడి జిల్లాలో మొత్తం మందుల షాపులు	2200
హోల్‌సేల్ షాపులు	180
రిటైల్ మందుల షాపులు	2020
రోజుకు సగటున మందుల షాపులకు వెళ్లేవారు	1.50 లక్షల మంది
ఇందులో డాక్టరు ప్రిస్క్రిప్షన్ లేకుండా వెళ్లేవారు	90 వేల మంది
రోజుకు సగటున మందుల వ్యాపారం	రూ.1.50 కోట్ల పైనే

వ్యాధినిరోధకత తగ్గిపోతోంది..

జబ్బు చిన్నది.. కానీ మందు మోతాదు చాలా పెద్దది. ఉదాహరణకు ఒక చిన్న గాయం తగలగానే అమాగ్జిలిన్, అగుమెంటేన్ వంటి యాంటీబయోటిక్స్ ఇస్తున్నారు. దీనికి తోడు సుదీర్ఘకాలం డైక్లోఫెనాక్ వంటి పెయిన్ కిల్లర్ ఇస్తున్నారు. ఇలా మోతాదుకు మించి వాడటం వల్ల పెద్ద పెద్ద జబ్బులకు ఈ మందులు పనిచేయకుండా పోతున్నాయి. దీన్నే యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ అంటారు. ఇక పెయిన్ కిల్లర్స్ ఎక్కువగా వాడుతుండటం వల్ల వేలాది మంది మూత్ర పిండాల వ్యాధులకు గురవుతున్నారు.

నేరుగా తీసుకోవద్దు



రోగులు నేరుగా మందుల షాపుకెళ్లి తీసుకోవడం మంచిది కాదు. ఏ జబ్బుకు ఎంత మోతాదులో ఎన్ని రోజులు వాడాలో డాక్టరు సూచిస్తారు. అలా ఏమీ లేకుండా ఫార్మసీలో తీసుకుని వెళితే నష్టం జరుగుతుంది. డాక్టరు ప్రిస్క్రిప్షన్ ఇవ్వకుండా అమ్మడం కూడా చేయకూడదు.

– రమేష్‌రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్, ఔషధ నియంత్రణ శాఖ

ప్రమాదం కొని తెచ్చుకోరాదు



జబ్బు ఏదో.. ఇస్తున్న మందు ఏదో.. లింకు తెలియకుండా మందులు మింగితే కొత్త రోగం వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా పెయిన్‌కిల్లర్స్ తీసుకుంటూ లేని ప్రమాదం కొని తెచ్చుకుంటున్నారు. డాక్టరు ఇచ్చిన మోతాదు మేరకు వాడితేనే రోగం నయమవుతుంది.

– డా.ప్రభాకర్‌రెడ్డి, హృద్రోగనిపుణులు

మందుగుండు పేలి పాడిఆవుకు తీవ్రగాయం



తీవ్రంగా గాయపడిన పాడి ఆవు

పుట్టపర్తి అర్బన్: మందుగుండు పేలి పాడి ఆవుకు తీవ్రగాయమైన ఘటన పుట్టపర్తి మండలం అమగొండపాళ్యం అడవిలో చోటుచేసుకుంది. వీరాంజనేయపల్లికి చెందిన వెంకటేషు కుమారుడు లక్ష్మీపతి తన పాడి ఆవులను మేత కోసం అటవీ ప్రాంతంలోకి తోలుతారు. ఆదివారం ఉదయం మందను తోలగా.. సాయంత్రం తీవ్ర గాయాలతో రక్తమోడుతూ ఓ ఆవు ఇంటికి వచ్చింది. మందు గుండు కొరకడంతో అది పేలి గాయాలపాలైనట్లు తేలింది. అడవి పందుల కోసం వేటగాళ్లు అడవిలో ఎక్కడంటే అక్కడ మందుగుండ్లు పెడుతుండడంతో ఇలాంటి ఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయని, 2019లోనూ ఇదే గ్రామానికి చెందిన ఓ రైతుకు చెందిన పాడి ఆవు తీవ్రంగా గాయపడి మృతి చెందిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

లోకేష్.. చిచ్చు రేపితే ఊరుకోం

ఆధారాలుంటే సవాల్ చెయ్

- స్క్రిప్టులు చదివి ప్రజలను రెచ్చగొట్టొద్దు
- అసత్య ఆరోపణలు చేస్తే నియోజకవర్గంలో తిరగనివ్వం
- తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వార్నింగ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి: యువగళం పాదయాత్ర ఏ ఉద్దేశంతో చేస్తున్నావో నీకు తెలుసా..? అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే ఏం చేస్తారు.. ఉన్న పథకాలు కొనసాగిస్తారా.. లేదా చెప్పకుండా వైఎస్సార్‌సీపీ నాయకులను, ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం ఏంటని నిలదీశారు. ప్రశాంతమైన పల్లెల్లో చిచ్చు రేపితే చూస్తూ ఉరుకునేది లేదంటూ వార్నింగ్ ఇచ్చారు. ఆదివారం ఆయన తాడిపత్రిలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్థానిక టీడీపీ నాయకులు రాసిచ్చిన స్క్రిప్టులు చదవడం తప్ప క్షేత్రస్థాయి పరిస్థితులు ఏమీ తెలియవని ఎద్దేవా చేశారు. గతంలో జేసీ సోదరుల (దివాకర్‌రెడ్డి- ప్రభాకర్‌రెడ్డి) ఫ్యాక్షన్ రాజకీయాలకు బలైన టీడీపీ కార్యకర్తలను మీ తండ్రి చంద్రబాబు పరామర్శించిన పాపాన పోలేదని గుర్తు చేశారు. టీడీపీ నాయకుడు కందిగోపుల మురళీప్రసాద్‌రెడ్డి ఇంటిని దహనం చేసి, ఆస్తులు కొల్లగొట్టినపుడు జేసీ బ్రదర్స్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించిన చంద్రబాబు.. కాంగ్రెస్‌ను వీడి టీడీపీ తీర్థం పుచ్చుకోగానే జేసీ సోదరులు సచ్ఛీలురైపోయారా అని నిలదీశారు. పరిటాల రవీంద్ర హత్య కేసులో కుట్రదారునిగా ఉన్న జేసీ సోదరులను పార్టీలోకి చేర్చుకుని జెండా మోసిన కార్యకర్తలను అవమానించిన ఘనత నీ తండ్రిదని ధ్వజమెత్తారు. నియోజకవర్గంలోకి అడుగుపెట్టడానికి ముందురోజు సవాల్ విసిరి.. మరుసటిరోజు తోక ముడుస్తున్న నీవు చేస్తున్నది అసలు పాదయాత్రేనా అని లోకేష్‌ను ప్రశ్నించారు. అసలు పాదయాత్ర ఎందుకు చేస్తున్నావో చెప్పే దమ్ము నీకుందా అని అన్నారు. పరిటాల రవి హత్య కేసులో కుట్రదారులుగా ఉన్న జేసీ సోదరులతో సిగ్గు లేకుండా చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్న పరిటాల సునీత కుటుంబ సభ్యులు ఒకసారి పునరాలోచించుకోవాలని పెద్దారెడ్డి సూచించారు. హత్యారాజకీయాలు వీడి విలువలతో కూడిన రాజకీయం చేయాలన్నారు.

అక్రమార్జనలో జేసీ సోదరులు రోల్ మోడలా?

జేసీ సోదరులు ఎందులో రోల్‌మోడల్ అని లోకేష్‌ను పెద్దారెడ్డి ప్రశ్నించారు. దొంగ లారీలు, బస్సులను ఎలా కొనుగోలు చేసి అమ్ముకోవచ్చు, మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలతో ఎలా సంపాదించుకోవచ్చు అనే విషయంలో జేసీ బ్రదర్స్ నీకు రోల్‌మోడలా అని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వస్తే టీడీపీ నాయకులు ఈ విధంగా దోపిడీలు చేసి బతకవచ్చని ఇప్పటి నుంచే ఆశలు కల్పిస్తున్నారా అని ప్రశ్నించారు. త్రిశూల్ సిమెంట్ పరిశ్రమ వ్యవహారంలో జరిగిన అక్రమాలపై గతంలో టీడీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు జేసీ సోదరులపై చేసిన వ్యాఖ్యలు ఈనాడు తదితర పచ్చపత్రికల్లో రాసింది వాస్తవం కాదని చెప్పగలవా? వీటి గురించి వాస్తవాలు మాట్లాడే దమ్ము నీకుందా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు భూకబ్జాలు, అక్రమాలు చేస్తున్నారని ఆరోపిస్తున్న నీవు జేసీ సోదరులు సొంత మండలంలో 300 ఎకరాల భూములను డోజర్ పెట్టి దున్ని ఆక్రమించుకున్న దానిపై మాట్లాడే ధైర్యం ఉందా అని లోకేష్‌ను నిలదీశారు.

అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోం..

ఆధారాలు లేకుండా అసత్య ఆరోపణలు చేస్తే తాడిపత్రి నియోజకవర్గం దాటిపోలేవని లోకేష్‌ను ఎమ్మెల్యే పెద్దారెడ్డి హెచ్చరించారు. అవాకులు చెవాకులు పేలితే లోకేష్ బస చేసే చోటుకే వస్తా.. ఆరోపణలు రుజువు చేయడానికి సిద్ధమేనా? అని సవాల్ చేశారు. టీడీపీ హయాంలో జేసీ సోదరులు చేయని అక్రమాలు, దౌర్జన్యాలంటూ లేవని, వాటిపై సమాధానం ఇవ్వకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపైన, నాయకులపైన ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని వార్నింగ్ ఇచ్చారు.

చంద్రబాబు, లోకేష్‌వి పగటి కలలే



మాట్లాడుతున్న రాష్ట్ర విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి. చిత్రంలో పైలా నర్సింహయ్య

- మరోసారి జగనే ముఖ్యమంత్రి
- మండలానికో ఎమ్మెల్యే ఉండరు
- అవగాహనారాహిత్యంతో మాట్లాడొద్దు
- రాష్ట్ర విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి

అనంతపురం క్రైం: 'అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల ప్రజలకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. అభివృద్ధి సైతం పరుగులు పెడుతోంది. జగన్ పారదర్శక పాలనకు జనం జై కొడుతున్నారు. అయినా మేమే అధికారంలోకి వస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ అంటున్నారు. వారు పగటి కలలు కనాల్సిందే' అని రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి అని విమర్శించారు. టీడీపీ – ఎల్లో మీడియా ఎన్ని కుట్రలు చేసినా అధికారంలోకి వచ్చేది వైఎస్సార్‌సీపీనే అని, మరోమారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి అవుతారని స్పష్టం చేశారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పైన, తనపైన చేసిన విమర్శలను సాంబశివారెడ్డి ఖండించారు. ఆదివారం అనంతపురంలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. లోకేష్ మాటలు రాజకీయ నాయకుడిలా కాకుండా చిల్లర వ్యక్తిని తలపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ పాలనలో సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని, నాడు– నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచి రూపురేఖలు మారుస్తున్నారని, రోడ్లు తదితర అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు. మహిళలు, రైతులు, విద్యార్థులు అన్ని వర్గాల అభ్యున్నతికి సీఎం జగన్ పాటుపడుతున్నారన్నారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుకే ప్రభుత్వ సాయం అందుతోందన్నారు.

దళితులను అవమానించడమే..

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తనకంటే విద్యావంతులరాలని, అటువంటిది శింగనమలలో ఎమ్మెల్యే భర్తదే పెత్తనమంటూ విమర్శలు చేయడం దళితులను అవమానపర్చడమేనని ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. తన కుటుంబీకులు 20 మందికిపైగా సివిల్ సర్వీసెస్ ద్వారా ఉన్నత హోదాల్లో ఉన్నారన్నారన్నారు. లోకేష్ ఒక్కసారైనా ఎమ్మెల్యేగా ఎన్నికై అసెంబ్లీలో కూర్చుని ఉంటే తెలిసేదన్నారు. ఆయన మండలానికో ఎమ్మెల్యే అన్న భావనలో ఉన్నారన్నారు. ఎక్కడా మండలానికి ఒక ఎమ్మెల్యే ఉండరన్న విషయం తెలుసుకుంటే మంచిదన్నారు. అవగాహనారాహిత్యంతో మాట్లాడి చులకన కావొద్దని హితవు పలికారు. ఎక్కడకు వెళ్లినా రెడ్డి..రెడ్డి అని సంబోధిస్తున్నాడని, ఇదే రిజర్వ్‌డ్ నియోజకవర్గంలో ఏ మండలంలోనైనా టీడీపీ వారు దళితులను, బీసీలను నాయకులుగా ఎదగనిచ్చారా అంటూ ప్రశ్నించారు. ఎస్సీ నియోజకవర్గంలో అగ్రవర్ణాల వారితో ద్విసభ్య కమిటీ వేసి పెత్తనమెందుకిచ్చారని నిలదీశారు. విద్యాసంస్థలను అడ్డం పెట్టుకుని ఆర్జిస్తున్నట్లు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. తాను 2007లో కళాశాల ఏర్పాటు చేసి రాయలసీమలోనే ఉత్తమ విద్యాసంస్థగా పేరుగడించానన్నారు. వేలాదిమందికి విద్యనందించి, ఉద్యోగాలు కల్పించేలా చర్యలు తీసుకున్నామన్నారు.

నిరూపిస్తే భూమిని పేదవారికి అందిస్తాం..

వందల ఎకరాల భూమి తనవద్ద ఆక్రమణలో ఉన్నట్లు నిరూపిస్తే తక్షణమే ప్రభుత్వానికి అందజేసి, నిరుపేదలకు పంపిణీ చేయిస్తామని ఆలూరు సాంబశివారెడ్డి ప్రకటించారు. గత ప్రభుత్వంలో టీడీపీ రైతులకేం చేసిందో చెప్పాలని లోకేష్‌ను డిమాండ్ చేశారు. రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి మోసం చేశారన్నారు. రెయిన్‌గన్ల పేరిట దోపిడీ చేశారని, ప్రతి ఊరిలో టీడీపీ నేతల ఇంట్లో రెయిన్‌గన్లు ఇప్పటికీ ఉన్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ టీడీపీ హయాంలో రైతులకు చేసిన మోసాలను వివరించారు. రైతులను పక్కదోవ పట్టించేందుకే లోకేష్ సమావేశాలు నిర్వహిస్తున్నారని, దీనివల్ల ఒరిగేదేమీ లేదన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చామలూరు రాజగోపాల్, మిద్దె కుళ్లాయప్ప, భాస్కర్, నాగేశ్వర రావు, వెంకటరాముడు, రామచంద్ర పాల్గొన్నారు.

ఎన్నాళ్లో వేచిన ఉదయం...

- డీఎస్సీ–98 అభ్యర్థులకు ఎస్జీటీలుగా అవకాశం
- కాంట్రాక్ట్ పద్ధతిలో ఎంటీఎస్ అమలు



సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ అనంతపురంలో చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న 1998 డీఎస్సీ అభ్యర్థులు (ఫైల్)

రాప్తాడురూరల్: వారంతా 1998 డీఎస్సీలో క్వాలిఫై అయ్యారు. దాదాపు 25 ఏళ్ల కిందటిమాట. అయినా ఉద్యోగాలు రాలేదు. అప్పటి నుంచి అనేక పోరాటాలు చేస్తూ వచ్చారు. న్యాయం జరగలేదు. విసిగిపోయిన చాలామంది అభ్యర్థులు పూర్తిగా ఆశలు వదులుకున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు చేపట్టిన పాదయాత్రలో పలుచోట్ల ఈ అభ్యర్థులు కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. మన అందరి ప్రభుత్వం రాగానే మీ న్యాయమైన సమస్యను కచ్చితంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట నిలుపుకొంటూ 98–డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థులను ఎస్జీటీలుగా పరిగణిస్తూ కాంట్రాక్ పద్ధతిలో మినిమం టైం స్కేల్ (ఎంటీఎస్) అమలు చేసేలా నిర్ణయించారు. ఈ మేరకు ప్రభుత్వం జీఓ విడుదల చేసి ఆ వెంటనే నియామకాల ప్రక్రియ ప్రారంభించింది.

అప్పట్లో అసలేం జరిగిందంటే..

1998 డీఎస్సీలో అభ్యర్థులు లేక పోస్టులు మిగిలిపోయాయి. దీంతో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం కటాఫ్ మార్కులను 50 నుంచి 45కు తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో అభ్యర్థులు చాలా సంతోషించారు. ఉమ్మడి రాష్ట్రంలో వేలాదిమంది అభ్యర్థులు అర్హత జాబితాలోకి చేరారు. అర్హత సాధించారు కానీ ఉద్యోగాలు మాత్రం ఇవ్వలేదు. వారికి పోస్టులివ్వకుండా ప్రభుత్వం నాన్చుతూ వచ్చింది. అప్పటి నుంచి 98–డీఎస్సీ అభ్యర్థులు పోరాటాలు చేస్తూనే ఉన్నారు. కానీ లాభం లేకపోయింది.

2014 ఎన్నికల్లో వాడుకున్న చంద్రబాబు..

డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల అవసరాన్ని 2014 ఎన్నికల ముందు చంద్రబాబు వాడుకున్నారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే 1998, 2008 డీఎస్సీల క్వాలిఫైడ్ అభ్యర్థులందరికీ న్యాయం చేసి ఉద్యోగాలిస్తామంటూ హామీ ఇచ్చారు. ఆ హామీని నమ్మి ఓట్లేశామని అభ్యర్థులు చెబుతున్నారు. ఆయన గెలిచి ముఖ్యమంత్రి అయిన తర్వాత హామీని పట్టించుకోకుండా అభ్యర్థుల ఆశలపై నీళ్లు చల్లారు.

జగన్‌కు రుణపడి ఉంటాం..

ఎన్ని ప్రభుత్వాలు మారినా మా గురించి పట్టించుకోకపోవడంతో పూర్తిగా ఆశలు వదులుకున్నామని 98–డీఎస్సీ అభ్యర్థుల అసోసియేషన్ ప్రతినిధులు చల్లా రామాంజనేయులు, నాగేశ్వరరావు, కిషోర్, నాగరాజు తదితరులు పేర్కొన్నారు. చంద్రబాబు 2014 ఎన్నికల మేనిఫెస్టోలో ఈ అంశం పెట్టి మోసగించాడన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో రాష్ట్ర వ్యాప్తంగా వేలాదిమంది కుటుంబాల్లో వెలుగులు నిండాయన్నారు. మా జీవితాంతం జగన్‌కు రుణపడి ఉంటామంటున్నారు.


2008–డీఎస్సీ అభ్యర్థులకూ న్యాయం

2008 డీఎస్సీలో అర్హత సాధించి పోస్టింగ్‌ల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న అభ్యర్థులకు కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి న్యాయం చేశారు. సీఎం సానుకూల నిర్ణయం తీసుకోవడంతో ఆరు నెలల కిందట రాష్ట్ర వ్యాప్తంగా వేలాదిమంది అభ్యర్థులకు లబ్ధి చేకూరింది. ఇందులోభాగంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో 192 మంది అభ్యర్థులకు ఎంటీఎస్ ప్రాతిపదికన ఎస్జీటీలుగా నియమించారు.

నేడు ప్రొవిజినల్ జాబితా

1998–డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల ప్రొవిజినల్ సీనియార్టీ జాబితాను సోమవారం కలెక్టర్ ఆమోదంతో విడుదల చేయనున్నారు. 11న అభ్యర్థులకు సమాచారం చేర వేయనున్నారు. 12, 13 తేదీల్లో కౌన్సెలింగ్ ద్వారా నియామక ఉత్తర్వులు అందజేయనున్నారు. ఇందుకోసం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ ఆధ్వర్యంలో సిబ్బంది కసరత్తు చేస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 536 మంది అభ్యర్థులకు అవకాశం కల్పించనున్నారు. ఎస్జీటీ పోస్టుల్లో కాంట్రాక్ట్ పద్ధతితో మినిమం టైం స్కేల్ (ఎంటీఎస్) ప్రాతిపదికన నియమించనున్నారు. బీఈడీ అర్హత కల్గిన వారు ప్రాథమిక విద్యకు సంబంధించి బ్రిడ్జి కోర్సు చేయాల్సి ఉంటుంది. జిల్లాలో 134 పోస్టులు ఖాళీలుండగా.. తక్కిన 402 పోస్టులను పశ్చిమ గోదావరి జిల్లా నుంచి సర్దుబాటు చేసుకున్నారు. ఇవి అడహాక్ పద్ధతిలోనే భర్తీ చేస్తారు. జిల్లాలో ఖాళీలు ఏర్పడగానే ఆ పోస్టుల్లో నియమిస్తారు. 20 –30 మంది విద్యార్థులున్న ఏకోపాధ్యాయ పాఠశాలలకు తొలి ప్రాధాన్యత ఇస్తారు. ఆ తర్వాత అసలే టీచర్లు లేని పాఠశాలలకు, విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండి టీచర్లు తక్కువగా ఉన్న స్కూళ్లలో నియమిస్తారు. చివరిగా ఖాళీగా ఉన్న సీఆర్పీ పోస్టుల్లోనూ నియమిస్తారు. మెరిట్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి స్థానాలు కేటాయిస్తామని డీఈఓ సాయిరామ్ వెల్లడించారు.

పరీక్ష ఒత్తిడి తాళలేక బలవన్మరణం



నవీన్‌కుమార్(ఫైల్)

ధర్మవరం అర్బన్: పరీక్ష ఒత్తిడి తాళలేక ఓ ఎంసీఏ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడిన ఘటన పట్టణంలోని వైఎస్సార్‌కాలనీలో చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని వైఎస్సార్ కాలనీకి చెందిన నారాయణస్వామి, ముత్యాలమ్మ దంపతుల కుమారుడు నవీన్‌కుమార్ (24) తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ఎంసీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఆరేళ్ల క్రితం తండ్రి నారాయణస్వామి మృతి చెందగా.. అప్పటి నుంచి తల్లి ముత్యాలమ్మ కూలి పనులు చేస్తూ కుమారుడిని చదివిస్తోంది. వారం క్రితం తిరుపతి నుంచి ధర్మవరానికి నవీన్‌కుమార్ వచ్చాడు. ఆదివారం తల్లి పని నిమిత్తం బయటకు వెళ్లగా.. ఇంట్లో ఫ్యానుకు నీళ్లపైపుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన ముత్యాలమ్మ ఉరికి వేలాడుతున్న కుమారుడిని చూసి కన్నీరుమున్నీరైంది. పరీక్షలకు సన్నద్ధమవుతున్న క్రమంలో ఒత్తిడి భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

అనంతపురం టౌన్: 'నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు' పథకం కింద చేపట్టిన గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కేశవనాయుడు ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం డీఈలు, ఏఈలతో టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెలాఖరులోపు 30వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలన్నారు. ఆలమూరు జగనన్న లేఅవుట్‌తో పాటు మరికొన్ని ప్రాంతాల్లో చేపట్టిన గృహ నిర్మాణాల్లో మంచి పురోగతి ఉందన్నారు. ఆప్షన్-3 కింద చేపట్టిన గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇంటి నిర్మాణ పనుల బిల్లులు సైతం ఎప్పటికప్పుడు లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఉమ్మడిశెట్టి సాహితీ పురస్కార ప్రదానం


అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: ఉమ్మడి శెట్టి సాహితీ పురస్కర సభ అనంతపురంలోని జీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది అవార్డును ప్రముఖ కవి వసీరా అందుకున్నారు. అలాగే ఉమ్మడిశెట్టి ఆత్మీయ పురస్కారాన్ని కవి, రచయిత, ఫిలిం డైరెక్టర్ రవీందర్ సూరికి అందించారు. భారతి కోడె, వాణి కొరట మద్ది, గీతా వెల్లంకి, జంగం స్వయం ప్రభకు డాక్టర్ ఎం.పార్వతి ప్రతిభా పురస్కారాలను డాక్టర్ పార్వతి కుటుంబ సభ్యుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు డాక్టర్ ఉమ్మడిశెట్టి రాధేయ మాట్లాడుతూ.. ఎన్నో అవాంతరాలు ఎదురవుతున్నప్పటికీ 35 ఏళ్లుగా ఎంతో ప్రతిష్టాత్మకంగా అవార్డు ప్రదానోత్సవాలను నిర్వహిస్తున్నట్లు గుర్తు చేశారు. ప్రముఖ కవి కొప్పర్తి వెంకటరమణమూర్తి మాట్లాడుతూ.. కవిత్వమనేది ప్రాథమికంగా హృదయ గతమైనదని, అనుభూతుల్లో నుంచి పుట్టుకువచ్చినప్పుడే దానిలో రసజ్ఞత ఉట్టిపడుతుందని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ కవి, విమర్శకులు సుంకర గోపాలయ్య, శీలా జయరామప్ప, తూముచెర్ల రాజారాం, దోర్నాదుల సిద్దార్థ, పెళ్లూరు సునీల్, అంకె శ్రీనివాస్, డాక్టర్ నాగేంద్ర, కొత్తపల్లి సురేష్, మధుర శ్రీ, రియాజుద్దీన్, ప్రముఖులు పాల్గొన్నారు.

పేరూరు జనసంద్రం


పేరూరులో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి ఘన స్వాగతం పలుకుతున్న ప్రజలు

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పర్యటన విజయవంతం
- భారీగా తరలివచ్చిన జనం
- ఆసరా సభకూ పోటెత్తిన మహిళలు

రామగిరి: పేరూరు జనసంద్రమైంది. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పర్యటన సందర్భంగా జనం పోటెత్తారు. మహిళలూ పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ప్రకాష్‌రెడ్డిని ఘనంగా స్వాగతించారు. గజమాలతో సత్కరించారు. తమ అడ్డా అని చెప్పుకునే పరిటాల కుటుంబానికి ప్రస్తుత జనసందోహం చూసి గుండెల్లో రైళ్లు పరుగెత్తడం ఖాయమని స్థానికులు చర్చించుకోవడం కన్పించింది.

దమ్ముంటే ఆ భూమిని అప్పగించండి

రాప్తాడు సమీపంలో జాకీ పరిశ్రమ ఏర్పాటు అంశంపై ప్రజలను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, మాజీ మంత్రి పరిటాల సునీత తప్పుదోవ పట్టిస్తున్నారని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మండిపడ్డారు. ఆదివారం పేరూరులో ఏర్పాటు చేసిన 'ఆసరా' సభలో ఆయన మాట్లాడారు. రూ.150 కోట్ల విలువైన భూమిని రూ.3 కోట్లకే టీడీపీ హయాంలో జాకీ పరిశ్రమ ఏర్పాటు కోసం అప్పగించారని గుర్తు చేశారు. 2015లో చంద్రబాబు హయాంలోనే ఈ పరిశ్రమను ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. అప్పట్లో ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు. ఈ విషయాలు కనుమరుగు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేలా పాదయాత్రలో లోకేష్ మాట్లాడారన్నారు. దమ్ముంటే జాకీ పరిశ్రమకు కేటాయించిన భూమిని తమకు అప్పగించాలన్నారు. అక్కడ ఆరు వేల మంది అక్కచెల్లెమ్మలకు ఉపాధి కల్పించేలా పరిశ్రమ ఏర్పాటు చేస్తామని పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, రాజశేఖరరెడ్డి, ఎంపీపీలు కరెన్న, భాగ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యులు నాగార్జున, మారుతీప్రసాద్; పార్టీ కన్వీనర్లు రమేష్, అమరనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా జనసంద్రమైన పేరూరు

నేనూ రె'ఢీ'

- కాలవ శ్రీనివాసులుకు ప్రభుత్వ విప్ కాపు ప్రతి సవాల్
- టీడీపీ ఐదేళ్ల పాలనలో ఏం చేశారో లెక్కలతో తీసుకురా
- గ్రామం ఏదైనా సరే నీవే డిసైడ్ చెయ్యి
- గడపగడపకూ వెళ్లి ఎవరి హయాంలో మంచి జరిగిందో తెలుసుకుందాం


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: 'ఇంత కాలం నేను పిలుస్తూనే ఉన్నా.. స్పందించలేదు. ఇప్పటికైనా చలనం వచ్చింది. అభివృద్ధిపై చర్చకు నేను రెడీ. ఇక నీదే ఆలస్యం' అంటూ మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులుకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ప్రతి సవాల్ విసిరారు. రాయదుర్గంలోని తన స్వగృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాపు మాట్లాడారు. కాలవ కపట నాటకాన్ని బయట పెట్టే ఏ అంశంలోనూ తాను తగ్గనని స్పష్టం చేశారు. గతంలో తాను చెప్పిన ప్రతి మాటకూ కట్టుబడి ఉంటానని, కాలవ కూడా అలాగే నడుచుకోవాలన్నారు. ఎవరి ప్రభుత్వంలో ఏఏ పథకాల ద్వారా ఎంత మందికి లబ్ధి చేకూరిందో గణాంకాలతో సహా వెల్లడి చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు. టీడీపీ హయాంలో ఎలాంటి సంక్షేమ పథకాలు అందించారు, వాటి పేర్లు, చేకూరిన లబ్ధిపై స్పష్టమైన లెక్కలతో రావాలని సూచించారు. నియోజకవర్గంలోని ఏ గ్రామమైనా, ఏ దినమైనా తనకు అభ్యంతరం లేదని, ఆ గ్రామం కూడా ఏదో డిసైడ్ చేసుకుని రావాలని సూచించారు. జన్మభూమి కమిటీలను వెంట బెట్టుకుని రావాలని, తాను కూడా పోలీసులు, గన్‌మెన్లను పక్కనపెట్టి పార్టీ కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో మాత్రమే వస్తానని భరోసానిచ్చారు.

82 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో 82 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడింది. విజిలెన్స్ డీఎస్పీ వీరరాఘవరెడ్డి తెలిపిన మేరకు... అనంతపురంలోని నడిమివంక ప్రాంతంలో ఆదివారం ఉదయం వాహనాల తనిఖీ చేపట్టిన సమయంలో అటుగా వచ్చిన ఆటోలో 40 క్వింటాళ్ల బియ్యం తరలిస్తున్నట్లుగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆటోను, దానికి రక్షణగా వస్తున్న స్కూటీని సీజ్ చేశారు. బియ్యం తరలిస్తున్న సోమందేపల్లి నివాసి అశ్వత్థ నారాయణ, తరుణ్‌తేజ్‌తో పాటు ఆలుమూరుకు చెందిన డ్రైవర్ సుబ్రహ్మణ్యం, మరికొందరిని అదుపులోకి తీసుకుని అనంతపురం మూడో పట్టణ పోలీసులకు అప్పగించారు. అలాగే గుత్తి రోడ్డులోని ఎన్టీఆర్ మార్గ్ క్రాస్ వద్ద ఆటోలో తరలిస్తున్న 42 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, వాహనాన్ని సీజ్ చేశారు. రాప్తాడు నివాసి వేముల రవికుమార్, బియ్యం తరలింపుదారు కురుబ హరిని అదుపులోకి తీసుకుని అనంతపురం వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు.

తత్కాల్ నకిలీ టికెట్లతో బురిడీ

కామారెడ్డి అర్బన్: తత్కాల్ కింద రైలు టికెట్లు బుక్ చేస్తానంటూ నమ్మించి బోగస్ టికెట్లు అందించి మోసం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కామారెడ్డి జిల్లా అశోక్‌నగర్‌కు చెందిన రాజు తెలిపిన మేరకు.. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురానికి చెందిన ఎనిమిది మంది స్నేహితులు ఈ నెల 4న కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం లచ్చాపేటలో నిర్వహించిన శుభకార్యంలో పాల్గొన్నారు. తిరిగి ఈ నెల 7న స్వగ్రామానికి వెళ్లడానికి టికెట్ల కోసం కామారెడ్డి రైల్వే స్టేషన్‌కు వచ్చారు. వారికి స్టేషన్‌లో ఓ వ్యక్తి పరిచయమై మొబైల్ ద్వారా రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో తత్కాల్ టికెట్లు బుక్ చేస్తానని నమ్మించి, వారి నుంచి రూ.3,500 తీసుకుని మొబైల్‌కు 8 టికెట్లు షేర్ చేశాడు. రైలు సికింద్రాబాద్‌కు చేరుకున్నప్పుడు టీసీ చెక్ చేయడంతో నకిలీవని తేలింది. దీంతో వారిని రైలు నుంచి దింపేశారు. విషయాన్ని రాజుకు స్నేహితులు తెలపడంతో ఆదివారం ఆయన కామారెడ్డి రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కాలవా.. దళితులపై కుట్రలు మానుకో

- ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర


మాట్లాడుతున్న రామచంద్ర

రాప్తాడురూరల్: దళితులను ఎదగనివ్వకుండా తన చెంచాగాళ్లతో తొక్కిపెట్టేందుకు మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ప్రయత్నిస్తున్నారని, ఇప్పటికైనా ఆయన కుట్రలు మానుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఆర్‌ఈఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు హెచ్.రామచంద్ర హెచ్చరించారు. ఆదివారం అనంతపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శింగనమల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ బండారు శ్రావణి పట్ల కాలవ శ్రీనివాసులు వ్యవహరిస్తున్న తీరును ఆయన ఖండించారు. తన కులాన్ని అడ్డం పెట్టుకుని రాజకీయాల్లోకి వచ్చిన కాలవ శ్రీనివాసులు.. జిల్లాలో స్థానికులైన వాల్మీకులను ద్వితీయ శ్రేణి నాయకులుగా ఎదగనివ్వకుండా అణచి వేశారని గుర్తు చేశారు. టీడీపీలో బోయ అంటే తనకు తప్ప ఇంకొక్కరికి స్థానం లేకుండా చేశాడని మండిపడ్డారు. ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గంలోనూ తనకు అనుకూలంగా ఉన్న అగ్రకులాల వారికి మద్దతునిస్తూ ద్విసభ్య కమిటీని ఏర్పాటు చేసి ఎస్సీలను తొక్కి పెట్టాలని చూస్తున్నాడన్నారు. దళితుల ఆత్మ గౌరవాని దెబ్బతీయాలని చూస్తే రాజకీయంగా భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జేబీ సురేష్, మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాకీర్‌హుస్సేన్, ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వలగొండ రామకృష్ణ, జిల్లా గౌరవాధ్యక్షుడు కోటి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆయనకు మాత్రమే గజమాలలు

- అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేయకుండానే వెళ్లిన నారా లోకేష్
- ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గ కేంద్రంలో లోకేష్ తీరుపై ప్రజల అసహనం

శింగనమల / పుట్లూరు: తనకు గజమాలలు వేయించుకుంటున్న నారా లోకేష్ పాదయాత్ర మార్గంలోనే ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి కనీసం పూలమాల వేయకపోవడంపై ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గమైన శింగనమల ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నారా లోకేష్ ఆదివారం శింగనమల మీదుగా యువగళం పాదయాత్ర చేపట్టారు. నియోజకవర్గ కేంద్రమైన శింగనమలలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేయకపోవడం, నివాళులర్పించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇక్కడ ఏ పార్టీ నాయకులు వచ్చినా ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించడం ఆనవాయితీ. మొదటిసారి శింగనమలకు వచ్చిన నారా లోకేష్ కూడా ఈ ఆనవాయితీ పాటిస్తారని అంతా ఆశించారు. కానీ వారికి అడియాసే ఎదురైంది.


కెమెరా షూట్‌లో రైతుతో మాట్లాడుతున్న నారా లోకేష్

స్టార్ట్.. కెమెరా.. యాక్షన్

లోకేష్ పాదయాత్ర ఆద్యంతం స్టార్..కెమెరా..యాక్షన్ అనేలా సినిమా చిత్రీకరణ పద్ధతిలో కొనసాగుతోంది. జంబులదిన్నె కొట్టాల వద్ద వన్నూరప్ప అనే రైతు పొలంలో నాలుగు కెమెరాలు, డ్రోన్ కెమెరా వినియోగించి రైతుతో లోకేష్ మాట్లాడటాన్ని చిత్రీకరించారు. పబ్లిసిటీ కోసం తాపత్రయపడుతుండడంపై సొంత పార్టీ నేతలే అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. పాదయాత్ర ఆదివారం జంబులదిన్నె కొట్టాలలోని విడిది కేంద్రం నుంచి ప్రారంభమై..గోవిందరాయునిపేట వద్దకు చేరుకుంది. పాదయాత్రలో లోకేష్ ఎక్కడా ప్రసంగించలేదు.

'చట్టసభల్లో ఈడిగలకు ప్రాధాన్యత కల్పించాలి'


అభివాదం చేస్తున్న నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: చట్టసభల్లో ఈడిగ (గౌడ)లకు ప్రాధాన్యత కల్పించేలా అన్ని రాజకీయ పార్టీలు చొరవ తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నేత కేజే కుమార్ కోరారు. ఈడిగలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే అంశంపై ఆదివారం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి, చర్చించారు. ఈడిగ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కేజే కుమార్, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జోనల్ కో-ఆర్డినేటర్ రమేష్ గౌడ్, బీజేపీ నేత బి.కిరణ్‌కుమార్ గౌడ్ హాజరయ్యారు. రాయలసీమ జిల్లాలతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. ఈడిగలకు రెండు ఎంపీ, మూడు ఎమ్మెల్యే, రెండు ఎమ్మెల్సీ స్థానాలతో పాటు వివిధ నామినేటెడ్ పోస్టులు కేటాయించాలన్నారు. వైన్ షాపులు, బార్ అండ్ రెస్టారెంట్ల ఏర్పాటులో 30 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని కోరారు. 45 ఏళ్లు నిండిన ప్రతి గీత కార్మికుడికి పెన్షన్ సదుపాయం కల్పించాలని, ప్రతి నియోజకవర్గంలో నీరాకేఫ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాకో కమ్యూనిటీ భవనం నిర్మాణానికి చొరవ తీసుకోవాలని, ఈత, ఖర్జూరం మొక్కల పెంపకానికి బీడు భూములు కేటాయించాలని, గీత కార్మికులకు వాహన సదుపాయం కల్పించాలని, పిల్లల ఉన్నత విద్యకు, విద్యావంతులైన యువత పారిశ్రామిక రంగంలో రాణించేలా ప్రోత్సాహకాలను అందజేయాలని కోరారు. తమ డిమాండ్లను నెరవేర్చే రాజకీయ పార్టీలకు మద్దతునివ్వాలని నిర్ణయించారు. సమావేశంలో నాగేంద్ర ప్రసాద్, నాగభూషణగౌడు, ప్రభాకర్‌గౌడ్, జక్కల లక్ష్మీనరసింహ, వెంకటస్వామిగౌడ్, అనిల్‌గౌడ్, మధుసూదన్‌గౌడ్, ఉమామహేష్ గౌడ్, సూరి, రామ్మోహన్‌గౌడ్, ఆదినారాయణ, భాగ్యలక్ష్మి, సూర్యప్రభాకర్, మేకల వెంకటేష్, వెంకటేష్‌గౌడ్, కరుణాకర్, రాజేష్‌గౌడ్, కుళ్లాయిస్వామి, మురళిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకలా ఫాదర్ ఫెర్రర్ జయంతి

అనంతపురం సప్తగిరి సర్కిల్/బత్తలపల్లి/కుందుర్పి: ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతిని రాష్ట్ర వ్యాప్తంగా 3,500 ప్రాంతాల్లో ఆదివారం వేడుకలా నిర్వహించారు. కరువు జిల్లా ప్రజలకు ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా పలువురు వక్తలు కొనియాడారు. నగరంలోని ఆర్డీటీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్ కేక్ కట్ చేసి, పంపిణీ చేశారు. అనంతరం ఇండియా ఫర్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన హుండీ కానుకల లెక్కింపును ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీటీ ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ విశాల ఫెర్రర్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కంబదూరులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాగా, ఫెర్రర్ జయంతిని పురస్కరించుకుని సర్వజనాస్పత్రిలో బీకేఎస్ దివ్యాంగుల సమాఖ్య సౌజన్యంతో సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ఇంద్రప్రసన్న, ఎర్రిస్వామి, నరసింహారెడ్డి, శ్రీలేఖ, సాయి ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

- బత్తలపల్లిలోని ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్, ఉమెన్స్ సెక్టార్ డైరెక్టర్ విశాలాఫెర్రర్ పాల్గొన్నారు. ఫెర్రర్ ఘాట్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, నివాళులర్పించారు. ఆర్డీటీ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి, ఆర్డీ ప్రమీల, ఏటీఎల్ రుక్మాంగద, ఆస్పత్రి ఇన్‌చార్జ్ హనుమంతరెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫెర్రర్ ఘాట్ వద్ద విద్యార్థులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. అనంతరం పలు సాంస్కృతి కార్యక్రమాలు, పౌరాణిక నాటకాలు ప్రదర్శించారు.
- కుందుర్పిలోని ఫెర్రర్ ఆలయంలో ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతిభక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛోఫెర్రర్, స్పెయిన్ రాయబారి పెర్నండో ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. కంబదూరు, కుందుర్పి మండలాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఫెర్రర్ విగ్రహానికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వైబీ ఓబయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజగోపాల్, ఓబిగానిపల్లి సుబ్బరాయుడు, కంబదూరు జెడ్పీటీసీ సభ్యుడు నాగరాజు, ఆలయ ధర్మకర్త సత్యనారాయణశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.


బత్తలపల్లిలోని ఫెర్రర్ ఘాట్ వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న విద్యార్థులు


అనంతపురంలో కేక్‌కట్ చేసి మాట్లాడుతున్న అన్నే ఫెర్రర్


కుందుర్పిలోని ఫెర్రర్ ఆలయంలో పూజల్లో పాల్గొన్న మాంఛోఫెర్రర్

క్లుప్తంగా

సంతల ద్వారా రూ.3.57 లక్షల ఆదాయం

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన జీవాలు, పశువుల సంతల ద్వారా రూ.3.57 లక్షలకు పైగా ఫీజు వసూలైనట్లు యార్డు చైర్మన్, ఏకేఎస్ ఫయాజ్, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత నుంచి రూ.1,92,170 కాగా, ఆదివారం పశువుల సంత ద్వారా రూ.1,65,480 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

సర్పరూపుడికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో సర్పరూపుడు

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరుడికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేకంగా పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, బంగారు కవచం, ధరింపజేసి, కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున భక్తులు రాహుకేతు హోమాలు నిర్వహించారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు.

రోడ్డుపై చెత్త కన్పించకూడదు

అనంతపురం క్రైం: రోడ్డుపై చెత్త కనిపించకుండా చర్యలు తీసుకోవాలని ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధర్‌రెడ్డి, పారిశుధ్య కార్యదర్శులను కమిషనర్ రమణారెడ్డి ఆదేశించారు. ఆదివారం ఆయన నగరంలోని ప్రధాన రోడ్లతో పాటు కమలానగర్, తదితర ప్రాంతాల్లో పర్యటించారు. పలు ప్రాంతాల్లో చెత్త ఉండడాన్ని చూసిన ఆయన తక్షణం వాటిని తరలించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. చెత్తను వేరు చేసి ఇచ్చేలా చూడాలన్నారు.

నేడు స్పందన

నగరపాలక సంస్థలో సోమవారం ఉదయం 10.30 గంటలకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. నగర ప్రజలు సమస్యలపై వినతులు అందించొచ్చని ఆయన తెలిపారు.

వైఎస్సార్‌సీపీతోనే సుభిక్షం



ఆత్మకూరులో ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటున్న దృశ్యం

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సుభిక్షంగా ఉన్నామని ప్రజలు ప్రజాప్రతినిధులు, నాయకులకు తెలియజేశారు. ఆదివారం మండలంలోని గ్రామ సచివాలయాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు వెళ్లి సంక్షేమ పథకాలు, వైఎస్సార్‌సీపీతో చేకూరిన లబ్ధిపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు , కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు .

మెగా కంటి వైద్య శిబిరం

అనంతపురం కల్చరల్: వాసవీ రక్తదాతల సంస్థ, హరిహర దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో శాంతిరామ్ మెడికల్ కాలేజీ, జనరల్ హాస్పిటల్ సహకారంతో హరిహర దేవాలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 200 మందికి కంటిపరీక్షలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. వాసవీ రక్తదాతల సంస్థ వ్యవస్థాపకుడు నవీన్‌కుమార్, ఆలయ కమిటీ అధ్యక్షుడు అంబటి ఫణిరాజ్ పాల్గొన్నారు.

దోపిడీనే పరిటాల కుటుంబ నైజం



మహిళాసంఘాల సభ్యులకు చెక్కు అందిస్తున్న ఎంపీ మాధవ్, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



'వైఎస్సార్ ఆసరా' సమావేశంలో పాల్గొన్న మహిళలు

- పేరూరు డ్యాంతోపాటు చెరువులకు హంద్రీనీవా నీరు
- వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రామగిరి/కనగానపల్లి: గతంలో 25 ఏళ్లపాటు పెనుకొండ, రాప్తాడు నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేగా పనిచేసిన పరిటాల కుటుంబం దోపిడీనే ధ్యేయమైతే.. మేము నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పేరూరులో రామగిరి, కనగానపల్లి మండలాలకు సంబంధించి వైఎస్సార్ ఆసరా కార్యక్రమ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యేతోపాటు ఎంపీ గోరంట్లమాధవ్, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నో హామీలు గుప్పించి, ప్రజలను మోసం చేశారన్నారు. పరిటాల సునీత మంత్రి హోదాలో అసెంబ్లీలో మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల రుణాలు మాఫీ చేయడంలేదని, ఆ ఆలోచన కూడా ప్రభుత్వానికి లేదని అన్నారన్నారు. రైతుల రుణాలను మాఫీ చేస్తామని చెప్పి చంద్రబాబు.. మోసం చేశారన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు...

టీడీపీ హయాంలో నియోజకవర్గానికి తాగునీటి పథకం తీసుకొద్దామనే ఆలోచన కూడా చేయలేదని ఎమ్మెల్యే అన్నారు. ప్రస్తుతం జలజీవన్ మిషన్ ద్వారా రూ.110 కోట్లతో ఆరు మండలాల్లోని ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. పేరూరు డ్యాంకు హంద్రీనీవా నీటిని తీసుకురావడంతోపాటు నియోజకవర్గంలోని అన్ని చెరువులను నీటితో నింపామన్నారు. త్వరలో రామగిరి బంగారు గనులను తెరిపించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ముత్యాలమ్మ ఆలయాన్ని దేవదాయశాఖ పరిధిలోకి తెచ్చామన్నారు.రైతులకు ఉచితంగా బోర్లు వేయించామన్నారు. ప్రస్తుతం అక్కాచెల్లెమ్మలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు డెయిరీని ఏర్పాటు చేసి ప్రారంభించనున్నట్లు తెలిపారు.

మహిళల పక్షపాతి వైఎస్ జగన్..

ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తదితరులు మాట్లాడుతూ మహిళల పక్షపాతి సీఎం జగన్ అని, రాష్ట్రంలో మహిళలకు సగ భాగం పదవుల్లో స్థానం కల్పించారన్నారు. బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి అన్నారు. రాష్ట్రంలో ఎంతో మందికి రాజకీయ పదవులు కల్పించి, ఉన్నత స్థానంలో నిలిపారన్నారు. అనంతరం కొల్లాపురమ్మ ఆలయంలో పూజలు చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం మెగా చెక్కు విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీపీలు కర్రెన్న, కుంపటి భాగ్యమ్మ, జెడ్పీటీసీలు గోసే నాగార్జున, గౌని మారుతీప్రసాద్, కన్వీనర్లు రమేష్, అమర్‌నాథ్‌రెడ్డి, సర్పంచ్ సరస్వతి, రెండు మండలాల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫా అందిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



ఇఫ్తార్ విందులో పాల్గొని భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం సప్తగిరి సర్కిల్: చాందినీ మసీదు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రంజాన్ తోఫా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. తొలిరోజు 100 మందికి రూ. 1,200 విలువజేసే రంజాన్ తోఫా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్, కార్పొరేటర్ ఇసాక్, చాందినీ మసీదు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు మునీర్‌బాషా, సభ్యులు రఫి, డాక్టర్ మునీర్, మౌలానా హారూన్ రషీద్, సిరాజ్, షెక్షావలి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

నగరంలోని కేఎస్ఆర్ గఫూర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో పేదలకు రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆదివారం జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం, మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గఫూర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. 200 మంది కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కేఎస్ఎఆర్ గఫూర్, డాక్టర్ అర్షద్ అయ్యూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే

నగరంలోని రెండో రోడ్డులోని బహవుద్దీన్ మసీదులో ఆదివారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, నగర మేయర్ వసీం, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్‌లు పాల్గొన్నారు. చాంద్‌బాషా, ఆజంబాషా నిర్వహించిన ఇఫ్తార్ విందులో వారు ముస్లింలతో కలిసి ప్రత్యేక దువాలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇసాక్, రహంతుల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు నిహార్‌రెడ్డి, శివారెడ్డి, మసీదు ముతవల్లి ఫరీద్, సెక్రటరీ పర్వేజ్, మౌలానా యూసుఫ్, షబ్బీర్, సమీ తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లలో నలభైఏళ్ల అభివృద్ధి

- జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో మేయర్ వసీం



జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: గత టీడీపీ పాలనలో వర్గ పోరుతో నగరంలో అభివృద్ధి కుంటుపడిందని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నగరపాలక సంస్థ చరిత్రలో ఎన్నడూలేని విధంగా అభివృద్ధి జరిగిందని మేయర్ వసీం అన్నారు. 40 ఏళ్లలో జరగని అభివృద్ధి ఈ నాలుగేళ్లలో చేస్తున్నామని, రూ.800 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలిపారు. ఆదివారం నగరంలోని 42వ డివిజన్‌లో జరుగుతున్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో మేయర్ వసీం, కార్పొరేటర్ రహంతుల్లా, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో కలసి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లారు. ప్రజా మద్దతు పుస్తకంలోని ప్రశ్నలకు జవాబులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటా మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. ప్రస్తుతం అందుతున్న సంక్షేమ పథకాల్లో సంతృప్తి ఉందా?.. ఇంకా ఏమైనా సమస్యలున్నాయా?అని స్థానికులతో ఆరాతీశారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా తమకు ఆర్థిక ప్రయోజనాలు చేకూరాయని ప్రతి ఇంటా ఆనందం వ్యక్తం చేశారు. పిల్లల భవిష్యత్తు కోసం అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన తదితర అభివృద్ధి కార్యక్రమాలు అందిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కొనసాగాలని మహిళలు మేయర్‌తో చెప్పారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆదేశాలతో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు, గృహసారథులు, వలంటీర్లు, చేపడుతున్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ఆదరణ లభిస్తోంది. కార్పొరేటర్లు రహంతుల్లా, ఇసాక్, నాయకులు ఖాజా, కన్వీనర్లు గడ్డం చంద్ర, హరిత, సల్మా, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల ఎమ్మెల్యేపై విమర్శలు తగవు

- ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల



మాట్లాడుతున్న ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల

అనంతపురం క్రైం: ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా ముందుకుతీసుకెళ్తుంటే..టీడీపీ నేత నారా లోకేష్ చౌకబారు రాజకీయాలు చేస్తున్నారని ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల అన్నారు. శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతిపై విమర్శలు చేయడం తగదన్నారు. ఆదివారం నగరంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, యల్లనూరు ఎంపీపీ గంగాదేవి, బీకేఎస్ సర్పంచ్ పార్వతితో కలసి ఆమె విలేకరులతో మాట్లాడారు. గత ఎన్నికల్లో ప్రజలు టీడీపీని చీదరించుకున్నా..పప్పూలో ఎలాంటి మార్పూ రాలేదన్నారు. శింగనమల చెరువును లోకలైజేషన్ చేయించి, ఒక టీఎంసీ నీరందించి రైతులు, ప్రజలు చిరకాల వాంఛ తీర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే జొన్నగడ్డ పద్మావతిదేనన్నారు. పాదయాత్రలో అధికారంలోకొస్తే ఏం చేస్తారో చెప్పకుండా వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలపై విమర్శలు చేయడం సరికాదన్నారు. చేతనైతే అభివృద్ధి జరగలేదని నిరూపించాలన్నారు. టీడీపీలో దళితులకు సముచిత స్థానం లేదని బీకేఎస్ సర్పంచ్ పార్వతి అన్నారు. ఇటీవల లోకేష్ పాదయాత్రలో చోటు చేసుకున్న పరిణామాలను ఆమె గుర్తు చేశారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం



రామినేపల్లిలో 'జగనన్న మా భవిష్యత్తు' పోస్టర్లను పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ మన్నల వరలక్ష్మి

రాప్తాడు: ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన అందిస్తున్నారని వైస్ ఎంపీపీ మన్నల వరలక్ష్మి అన్నారు. మండలంలోని రామినేపల్లిలో మూడో రోజూ 'జగనన్నే మా భవిష్యత్తు-మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరుపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మారూరు సొసైటీ అధ్యక్షుడు మాచిరెడ్డి కొండా రెడ్డి, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నారాయణ స్వామి, మాజీ వైస్ ఎంపీపీ గవ్వల పరంధమ, వైఎస్సార్ సీపీ నాయకులు మన్నల రవికుమార్, సాకే చంద్ర, ముత్యాలు, జయన్న, మాచిరెడ్డి చెన్నారెడ్డి, నరసింహారెడ్డి, చిరుతల నాగేంద్ర, కపాడం ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు పూలే జయంతి

అనంతపురం రూరల్: మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు ఈ నెల 11న ఘనంగా నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూ కొఠారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు జెడ్పీ కార్యాలయ ఆవరణలో ఉన్న జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించి, అనంతరం జెడ్పీ సమావేశ హాలులో జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి కలెక్టర్‌తోపాటు జిల్లాలోని ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు.

అమ్మళ్లదిన్నె సరోజమ్మ మృతి

అనంతపురం కల్చరల్: నగరంలోని సోమనాథ్‌నగర్‌కు చెందిన సుప్రసిద్ధ కళాకారుడు, హాస్యభారతి అమ్మళ్లదిన్నె గోపినాథ్ సతీమణి అమ్మళ్లదిన్నె సరోజమ్మ (87) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. గోపీనాథ్‌తో కలిసి ఆమె అనేక సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద సాహిత్య ప్రచారాల్లో పాల్గొన్నారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సరోజమ్మ పార్థివ దేహానికి పలువురు సాహితీ వేత్తలు, కళాకారులు నివాళులర్పించారు. ఏపీ నాటక అకాడమీ చైర్‌పర్సన్ హరిత ఓ ప్రకటనలో ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో వసంతోత్సవం



బ్రహ్మోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: నగరంలో మొదటిరోడ్డు కాశీ విశ్వేశ్వర కోదండరామాలయంలో వసంతోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. పదిరోజుల పాటు సాగిన శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ప్రధాన అర్చకులు నరసింహశాస్త్రి, కరణం హర్షశర్మ, ధర్మకర్తల మండలి సభ్యులు స్వామి వారి వసంతాలు చల్లుతూ ధ్వజారోహణ చేసి, ఉత్సవాలు ముగిసినట్లు ప్రకటించారు. సీతారాముల మూలమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, అలంకార సేవలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ, అనంతరం బ్రహ్మోత్సవం నిర్వహించారు.

ఘనంగా ఈస్టర్ పర్వదిన వేడుకలు



సీఎస్ఐ ట్రినిటీ హోలి చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

అనంతపురం కల్చరల్: నగరంలోని ప్రార్థనా మందిరాల్లో ఈస్టర్ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. నగరంలోని అరవిందనగర్ సీఎస్ఐ చర్చి, జీసస్ కంగ్రెషన్ చర్చ్, సప్తగిరి సర్కిల్‌లోని ఎస్ఐయూ, రామచంద్రనగర్‌లోని కార్మియల్ మాత మందిరం, కోర్టురోడ్డులోని గ్యాస్పెల్ చర్చి, కళాకారుల కాలనీలోని ప్రేమ చర్చ్, క్రీస్తు విశ్వాసుల సంఘం తదితర చోట్ల ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు జరుపుకున్నారు. సాయంత్రం చిన్నారుల ఆటపాటలు, భక్తిగీతాలతో అలరించారు.



ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు





వసంత పుస్తకమా.. విరబూసిన కాగితమా!

విజ్ఞానం అందించే విద్యాలయంలో..ఆహ్లాదం పంచే రంగు రంగుల పూతోట ఉంటే ..అక్కడి వాతావరణం వసంతం చల్లినట్లు వికసిస్తుంది. రంగుల లోకంలో విహరిస్తున్నట్లుంది.. సుగంధంలా పరిమళించే పూలమొక్కల మొదళ్లలో కూర్చొని పుస్తకం తెరిచి అక్షరాలను ఆకళింపు చేస్తుంటే ..మేథస్సు పెరుగుతుంది..మనసుకు హాయినిస్తుంది. ఉన్నత శిఖరాలు ఎక్కి విశ్వఖ్యాతి చాటినట్లుంది. శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయ ద్వారం నుంచి లోపలికి ప్రవేశిస్తే..ఎటువైపు చూసినా పచ్చదనం పరిచినట్లు కనిపించే సుందర దృశ్యాన్ని 'సాక్షి' బంధించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

పేదల ఆశాజ్యోతి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్



ఫాదర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.రామచంద్ర



రాప్తాడు: పుల్లలరేవులో ఫెర్రర్ చిత్ర పటాన్ని ట్రాక్టర్‌లో ఊరేగిస్తున్న దృశ్యం



రాప్తాడు: ఫెర్రర్ జయంతి సందర్భంగా కేక్ కట్ చేస్తున్న విదేశీయులు

అనంతపురం: ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ నిరుపేదల ఆశాజ్యోతి అని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రామచంద్ర అన్నారు. ఆదివారం ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతి సందర్భంగా ఎస్కేయూలో ఆయన చిత్రపటానికి ఘన నివాళి అర్పించారు. ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఒక భవనాన్ని ఉచితంగా నిర్మించి ఇచ్చిన మహనీయుడు అని కొనియాడారు. పేదలకు విద్య, వైద్యం, మౌలిక వసతులు కల్పించి, దన్నుగా నిలిచారని ప్రశంసించారు. ఆర్డీటీ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి, సంక్షేమ ప్రదాతగా నిలిచారని కొనియాడారు.

అనంతపురం టవర్‌క్లాక్: స్థానిక కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఫాదర్ విన్సెంటు ఫెర్రర్ విగ్రహానికి బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ కాసాని నాగరాజు, జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ అంకే కుళ్లాయప్ప పూలమాల వేసి, నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఫాదర్ ఫెర్రర్ కరువు జిల్లాకు దన్నుగా నిలిచారన్నారు. ఎన్నో సేవా కార్యక్రమాలు చేసి, పేదల హృదయాల్లో నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో నాయకులు హేమసుందర్, హరిప్రసాద్, నాగరత్నమ్మ, ఎల్లప్ప పాల్గొన్నారు.

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగర శివారులోని ఆకుతోటపల్లి గ్రామంలో ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పేదల జీవితాల్లో ఫెర్రర్ వెలుగులు

రాప్తాడు: పేదల జీవితాల్లో ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ వెలుగు నింపారని ఏటీఎల్ మల్లికార్జున తెలిపారు. ఆదివారం మండల వాప్తంగా అన్ని గ్రామాల్లో ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ప్రజలు ఏర్పాటు చేసుకున్న 'స్పందించు-సహయం అందించు' కార్యక్రమ హుండీలను ఓపెన్ చేశారు. వరిమడుగు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఏటీఎల్ మల్లికార్జున, స్పెయిన్ దేశస్తులు ఏడుగురు పాల్గొన్నారు. అనంతరం ఏటీఎల్ మాట్లాడుతూ జిల్లా కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్‌ది అని కొనియాడారు.

ఫెర్రర్ ఆశయాలు కొనసాగిద్దాం

కనగానపల్లి: విన్సెంట్ ఫాదర్ ఫెర్రర్ ఆశయాలు కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని ఆర్డీటీ మహిళా విభాగం డైరెక్టర్ విశాలా ఫెర్రర్ తెలిపారు. ఆదివారం ఆర్డీటీ వ్యవస్థాపకుడు విన్సెంట్ ఫాదర్ ఫెర్రర్ జయంతి వేడుకలు మండలంలోని పలు గ్రామాల్లో జరుపుకున్నారు. ముక్తాపురం గ్రామంలో జరిగిన ఫెర్రర్ జయంతి కార్యక్రమంలో విశాల ఫెర్రర్ పాల్గొని, జాతీయ రహదారి పక్కన ఉన్న ఫాదర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన స్పందించు- సాయమందించు కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో ఆర్డీ ప్రమీల, ఏటీఎల్ రఘురామ్, పలువురు ఆర్డీటీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

14న సోషల్ వెల్ఫేర్ స్కూల్ ప్రారంభం

అనంతపురం క్రైం: ఈ నెల 14న అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని కొర్రపాడులో డాక్టర బీఆర్ అంబేడ్కర్ సోషల్ వెల్ఫేర్ స్కూల్‌ను ప్రారంభించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన అనంతపురంలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. అదే రోజున ఎస్సీలతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దళితులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు చామలూరు రాజగోపాల్, మిద్దె కుళ్లాయప్ప, భాస్కర్, నాగేశ్వర రావు, వెంకటరాముడు, రామచంద్ర పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవం

అనంతపురం: ఎస్కేయూలో ఎన్ఎస్‌యూఐ 52వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర యూనివర్సిటీల కన్వీనర్ యనమల ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎన్ఎస్‌యూఐ రాజీలేని పోరాటాలు చేసిందన్నారు. వర్సిటీలో ఎన్ఎస్‌యూఐ కమిటీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు అరుణ్‌కుమార్, సురేష్, ఇలియాజ్, కిశోర్, ఇంతియాజ్, ముత్యాలు, మాధవ్, రమేష్ , ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వేమన తదితరులు పాల్గొన్నారు.